క్లుప్తంగా

మైక్రో బయాలజీ అధిపతిగా సుజాత బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మైక్రో బయాలజీ విభాగం అధిపతిగా ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాతను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ వెంకటయ్య నుంచి సుజాత బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఆమె రెండేళ్లపాటు పదవిలో ఉండనున్నారు. ఈ మేరకు ఆమెను అధ్యాపకులు అభినందించారు.

బీసీ సెల్ డైరెక్టర్‌గా సతీష్..

కేయూ బీసీసెల్ డైరెక్టర్‌గా జియాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, బీసీ సెల్ మాజీ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్, ప్రొఫెసర్లు మల్లికార్జున్ రెడ్డి, మల్లారెడ్డి, ఇస్తారి, డాక్టర్ కనకయ్య, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదిగిరి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బస్తాకు ఇద్దరు!



హసన్‌పర్తి: మండలంలో యూరియా కొరత వేధిస్తోంది. హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఆదివారం రాత్రి 220 బస్తాల యూరియా దిగుమతి అయ్యింది. వాటి కోసం 400 మంది క్యూకట్టారు. అలాగే మల్లారెడ్డిపల్లి సొసైటీలకు కూడా 200 బస్తాలు యూరియా అందించారు. ఇక్కడ 363 మంది రైతులు ఎగబడ్డారు. దీంతో సొసైటీల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో రైతుకు రెండేసి చొప్పున బస్తాలు అందించారు. దీంతో క్యూ అదుపు తప్పింది. ఉదయం నుంచి క్యూలో ఉన్నప్పటికీ యూరియా అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంతేజార్‌గంజ్ పీఎస్ తనిఖీ



ఖిలా వరంగల్: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ ఏఎస్పీ శుభం సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ సుక్రును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలని, పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలని, ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని, సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఏఎస్పీ ఆదేశించారు.

వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్‌లో నిల్వ చేసిన పురుగు మందులను పరిశీలించారు. వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్‌లో నకిలీ పురుగు మందులు ఉన్నాయనే సమాచారంతో తనిఖీ చేశామని, ట్రాన్స్‌పోర్ట్ ఎలాంటి నకిలీ పురుగు మందులు నిల్వ లేవని వరంగల్ మండల వ్యవసాయ అధికారి రవీందర్ తెలిపారు.

విద్యార్థికి చేయూత

కాజీపేట రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థికి కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేయూతనిచ్చినట్లు సర్వప్రేమ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వై.భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. జనగామ జిల్లా రఘునాథ్‌పల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థి యాకూబ్ గత సంవత్సరం యాక్సిడెంట్ కాగా, సర్జరీ అయింది. ఈక్రమంలో చికిత్స పొందుతున్నా వ్యాధి నయం కావడం లేదు. ఈ మేరకు యాకూబ్‌కు 18 మంది స్నేహితుల సహకారంతో రూ.61,600 అందజేసినట్లు భాస్కర్‌రెడ్డి వివరించారు. నిర్మల జ్యోతి, సుజాత, తోట నాగరాజు, మునిగాల రాజు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి సెంట్రల్ వర్సిటీలో సీటు



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ పూర్తిచేసిన విద్యార్థి నాగుల వినయ్‌కు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ ఆర్ట్స్ ఆఫ్ హిస్టరీలో సీటు లభించింది. ఈమేరకు వినయ్‌ను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, హిస్టరీ విభాగం అధిపతి భిక్షపతి, రాంబాబు, కరుణాకర్ రావు, తిరుణహరి శేషు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మత్తడి.. సందర్శకుల తాకిడి

- ఉప్పొంగుతున్న ఎల్లమ్మ చెరువు
- మత్తడిని చూసేందుకు తరలివస్తున్న జనం



మత్తడిని ఆనందంగా తిలకిస్తున్న ప్రజలు



మత్తడి వద్ద యువతుల సందడి

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని రేణుక ఎల్లమ్మ చెరువు నిండుకుండలా మారింది. ఒకవైపు చిరు వర్షపు జల్లులు.. మరోవైపు మత్తడి దూకుతుండడంతో వరద ప్రవాహం ఉరకలేస్తోంది. ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలోనే కురిసిన వానలకు ఎల్లమ్మ చెరువు సంపూర్ణంగా నిండింది. తాజాగా చెరువు మత్తడిని చూసేందుకు జనం భారీగా తరలివస్తున్నారు. యువతీ యువకులు సెల్ఫీలు తీసుకుంటూ కేరింతలు కొడుతున్నారు. మరోవైపు మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. మత్తడిని చూసేందుకు జనం తరలి వస్తుండడంతో ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. తహసీల్దార్ భావ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో తరుచూ చెరువు పరిస్థితిని పరిశీలించి వెళ్తున్నారు. మత్తడి పారుతుండడంతో ప్రమాదాలు జరగకుండా సుబ్బయ్యపల్లె, రంగుల కంపెనీ, ఉనికిచర్ల గ్రామాలకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి.

సిలబస్‌కే పరిమితం కావొద్దు

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులు సిలబస్‌కు మాత్రమే పరిమితం కావొద్దని, పాఠ్యాంశేతర అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిగా పాల్గొన్న టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ మాట్లాడుతూ సామాజిక ప్రయోజనం కోసం ఆచరణాత్మక పరిష్కారాలు చూపడంలో ఇంజనీర్లదే ప్రధాన పాత్ర అని గుర్తుచేశారు. కృత్రిమ మేధ నేపథ్యంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్, డాక్టర్ సీహెచ్.రాధిక, డాక్టర్ సుమలత, డాక్టర్ ఆసింఇక్బాల్ పాల్గొన్నారు.

వీసీ చాంబర్ ప్రారంభం



చాంబర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం రెండో ఫ్లోర్‌లో నిర్మించిన వైస్ చాన్సలర్ చాంబర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవరెడ్డి, ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీకి పెరుగుతున్న ఆదరణ’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంతోష్ రెడ్డి

హన్మకొండ: బీజేపీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గీసుగొండ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకుడు కామని భాస్కర్, ఊకల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పడిదల కిషన్ రావుతో పాటు తదితరులు గీసుకొండ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీలో చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి సంతోష్ రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్‌రెడ్డి, నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, ములక ప్రసాద్, నిమ్మగడ్డ జాన్ విక్రమ్, పగడాల రాజ్ కుమార్, కూతురు రాజు, ఆకుల వెంకటేశ్వర్లు, ఏడాకుల రాజిరెడ్డి, అరకట్ల ప్రవీణ్, బూర్గుల యుగంధర్, ఎంబడి రాజశేఖర్, గట్ల భిక్షపతి, బాల రాజు సందీప్, కొత్ర తిరుపతిరెడ్డి, మేడిశెట్టి రాముడు, కక్కర్ల రాజు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ముచ్చర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్ రెడ్డి, చిర్ర శ్రవణ్, కుమార్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, రూపేష్, పవన్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సులో డీజిల్ చోరీ

హన్మకొండ: ఆర్టీసీ అద్దె బస్సుల్లో డీజిల్ చోరీకి గురైనట్లు సమాచారం. క్లీనరే చోరీకి పాల్పడినట్లు అద్దె బస్సు ఓనర్ తెలిపారు. హనుమకొండ డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8488 నంబర్ గల అద్దె బస్సును ఈనెల 1 వరకు నడిపి నిర్వహణను భరించలేక బస్సు యజమాని రాజు నిలిపివేశారు. ఆ బస్సు హనుమకొండ - జనగామ మధ్యలో రోజుకు నాలుగు ట్రిప్పులు తిరిగేది. ఆ బస్సును హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో పార్కింగ్ చేశాడు. ఇదే అదనుగా భావించిన క్లీనర్ రెండు రోజులకు ఒకసారి డిపోకు ఆ బస్సును తీసుకెళ్లి డీజిల్ నింపుకుని వీలును బట్టి విక్రయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ బస్సును వేరే వ్యక్తికి బస్సు యజమాని రాజు విక్రయించాడు. బస్సు కొనుగోలు చేసిన వ్యక్తి.. డిపోకు వెళ్లి బస్సుకు సంబంధించిన సమాచారం తెలుసుకోగా, నాలుగు సార్లు బస్సులో డీజిల్ పోసుకున్నట్లు రికార్డులో ఉన్నట్లు గుర్తించాడు. బస్సు నడవలేదని చెప్పినప్పటికీ డీజిల్ పోసుకున్నట్లు ఉందని, ఈ ఖర్చులు ఎవరు భరించాలని బస్సు విక్రయించిన యజమాని రాజు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ఇల్లు రాలేదని హంగామా

రామన్నపేట: తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించకుండా అన్యాయం చేశారని గీసుగొండ మండలం వంచనగిరికి చెందిన కొమ్ముల సుభాష్ సోమవారం రాత్రి వరంగల్ చౌరస్తాలోని హోర్డింగ్ ఎక్కి హంగామా సృష్టించాడు. ఈ క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ సుజాత.. సదరు వ్యక్తిని సముదాయించి కిందికి దించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



టీషర్ట్స్ అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ కుమారస్వామి, కొల్లూరి సబిత చేయూతనిచ్చారు. సుమారు రూ.70 వేల (వడ్లకొండ కుమారస్వామి రూ.55 వేలు, తన భర్త కొల్లూరి రాజేష్ జ్ఞాపకార్థం కొల్లూరి సబిత రూ.15 వేలు) విలువైన షూ, టీ షర్ట్స్, సాక్స్, టై, బెల్టులు, ఐడీ కార్డులను అందించారు. అలాగే, మహిళా సంఘం సభ్యులు రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిద్దాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సీఆర్‌పీ నాగరాజు, ఉపాధ్యాయులు సంపత్, తిరుపతిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



రామల సునీతను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

హన్మకొండ కల్చరల్: శ్రావణమాస బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని వరంగల్ కాశిబుగ్గ పోచమ్మ దేవాలయ ఈఓ శేషగిరి, అర్చకుడు ఓరుగంటి రాజేందర్‌ను వరంగల్ దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత ఆదేశించారు. ఈ మేరకు కాశిబుగ్గ పోచమ్మ దేవాలయాన్ని సునీత సోమవారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెకు కమిటీ సభ్యులు అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధ్యాపకులకు సన్మానం



పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, స్టాఫ్ క్లబ్ బాధ్యులు, అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, అండ్ పీజీ కళాశాలలో తొమ్మిది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు పదోన్నతి పొందిన జి.సుహాసిని, సురేష్‌బాబు, ఎం.అరుణ, లకాన్‌సింగ్, డి.సునీత, టి.శ్రీలత, పి.రాజిరెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, రేణుకను కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, క్లబ్ బాధ్యులు, విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో మాలధారులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో కొయ్యడ ఉమ నేతృత్వంలో అయ్యప్ప పడిపూజను శాస్త్రోక్తంగా సోమవారం జరిపించారు. గురుస్వామి బత్తిని సతీష్‌కుమార్, వేద పండితుడు వెంకటరమణ శర్మ హాజరై 18 మెట్ల పీఠంపై అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠించి పడిపూజ చేశారు. అంతకుముందు ప్రత్యేక పీఠంపై గణపతి, లక్ష్మి, అయ్యప్ప స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులు, అయ్యప్ప మాలధారులకు అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో బత్తిని సతీష్‌గౌడ్, బత్తుల సత్యం, మధుగౌడ్, రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మంజులకు పద్మ చక్ర అవార్డు

హసన్‌పర్తి: పద్మ చక్ర అవార్డును 56వ డివిజన్ గోపాలపురానికి చెందిన డాక్టర్ సాగంటి మంజుల అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు బాబుమోహన్ నుంచి అవార్డు స్వీకరించారు. సంగీతం, సాహిత్యం, సామాజిక, విద్య, చిత్ర రంగాల్లో విశిష్ట సేవలదిస్తున్నందుకు ఆమెకు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మామునూరు: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పరిశోధనాత్మకమైన విద్యను పెంపొందించుకోవాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ సత్యపాల్‌రెడ్డి సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రకాశ్ అధ్యక్షతన బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సత్యపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధునిక సౌకర్యాలు, ప్రాజెక్టులు, పరిశోధనలు, సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ.ముస్తాక్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ కె.తిరుపతిరావు, డీన్ ఎం.శశిధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేణుకఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మడికొండ: కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో రేణుకఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి స్టేట్ ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

‘డీఈఓ’ను విధుల్లో నుంచి తొలగించాలి

విద్యారణ్యపురి: వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌ను విధుల్లో నుంచి తొలగించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ అడిషనల్ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ హరిచరణ్, వరంగల్ మహానగర కార్యదర్శి బెల్లం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

‘సంకీర్తన ఆస్పత్రి’పై చర్య తీసుకోవాలి

హన్మకొండ: తప్పుడు రిపోర్టు ఇచ్చిన సంకీర్తన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతల తండాకు చెందిన బానోత్ గణేష్ కోరారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగిన దాడిలో గాయపడిన తనను తన భార్య శారద హనుమకొండ బాలసముద్రంలోని సంకీర్తన ఆస్పత్రిలో చేర్పించిందని తెలిపారు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను ఈఎస్‌ఐ ఆస్పత్రి సీఏ ఉద్యోగి, సంకీర్తన ఆస్పత్రిలో సేవలందిస్తున్న జాటోతు రవికుమార్ పరీక్షించి పలు వైద్య పరీక్షలు నిర్వహించి బండ రాళ్లతో బలంగా కొట్టినట్లు గుర్తించారని చెప్పారు. పరిస్థితి విషమంగా ఉందని కేస్ షీట్‌లో పొందుపరిచారని పేర్కొన్నారు. ఐసీయూలో ఉంచి రూ.70 వేల ఫీజు తీసుకున్నారని వివరించారు. కాగా, పోలీసులు విచారణకు ఆస్పత్రికి రాగా, చికిత్స చేసిన డాక్టర్ జాటోతు రవికుమార్.. తనపై దాడి చేసిన ప్రత్యర్థుల నుంచి ముడుపులు తీసుకుని వాస్తవ రిపోర్టును మార్చి కేసు నీరుగార్చేలా పోలీసులకు మాములు రిపోర్టు ఇచ్చారని ఆరోపించారు. ఇలా తప్పుడు రిపోర్టు ఇచ్చిన ఆస్పత్రిపై చర్య తీసుకోవాలని బానోత్ గణేష్ కోరారు.

‘నేను భూ కబ్జాలకు పాల్పడలేదు’

ఖిలా వరంగల్: భూ కబ్జాలు, డబుల్ రిజిస్ట్రేషన్లకు తాను పాల్పడలేదని, తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని రియల్టర్ ఎంఏ జబ్బార్ అన్నారు. ఈ మేరకు వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖిలా వరంగల్ మండలం వసంతాపూర్ శివారు 109, 110 సర్వే నంబర్లలో తాను, కోటేశ్వర్ కలిసి కొనుగోలు చేసిన ఐదెకరాల భూమిని చెరిసగం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపారు. తన వాటాకు వచ్చిన 2.5 ఎకరాల భూమిని బొల్లం ప్రతాప్‌కు అగ్రిమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేశానని స్పష్టం చేశారు. బొల్లం ప్రతాప్‌కు చెందిన 2.5 ఎకరాల భూమిని కోటేశ్వర్ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, అధిక డబ్బు ఆశిస్తూ రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులు గురి చేశాడని అన్నారు. కోటేశ్వర్, తన మధ్య ఎలాంటి లావాదేవీలు లేవని, తనపై కోటేశ్వర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఖండించారు. తనపై వచ్చిన ఆరోపణలపై పరువునష్టం దావా వేస్తానని జబ్బార్ పేర్కొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న



రాంపూర్‌లో పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తదితరులు

తెలంగాణ బహుజన వీరుడు, ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని పలువురు కొనియాడారు. పాపన్న జయంతి సందర్భంగా నగర వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో..



కడిపికొండలో..



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



కాజీపేట చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో గౌడ సంఘం సభ్యులు



కేయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఎంజీఎంలోని సమస్యలపై సర్వే



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు సింగరాపు బాబు డిమాండ్‌చేశారు. ఎంజీఎంలో సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని ఆర్ఐసీయూలో 10 వెంటిలేటర్లు పనిచేయడం లేదని, న్యూరో ఐసీయూలో 10 పడకలకు గాను మూడు వెంటిలేటర్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర వార్డులో మానిటర్ల కొరత ఉందని, వైద్య పరీక్షలకు రోగులకు బయటకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఔషధాల కొరత ఉందని, ఎమర్జెన్సీ విభాగం వద్ద వీల్ చైర్లు లేవని అన్నారు. అకాల వర్షాలకు ఆపరేషన్ థియేటర్‌లోకి నీరు వస్తోందని తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరూరి కుమార్, గున్నాల ప్రభాకర్, రేణుక, అప్పాజీ వాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామన్నపేట: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 452 మంది కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని, ఒక్కపూట పనిని అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య మాట్లాడుతూ హార్టికల్చర్, మలేరియా, వాటర్ సప్లై విభాగాల్లో పనిచేస్తున్న దినసరి కార్మికులకు కలెక్టర్ గెజిట్ ప్రకారం పెంచిన వేతనాలు అమలు చేయాలని సూచించారు. ఆల్ హెవీ వెహికల్ డ్రైవర్లకు పెంచిన రూ.20,500 జీతాన్ని అమలు చేయాలని, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్లు, యూనిఫామ్స్, రెయిన్ కోట్లు, ఇతర మెటీరియల్స్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబు, జన్ను ప్రకాశ్, బరుపట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



జీపీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాగారం పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లోవోల్టేజీ కారణంగా విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయని వాపోయారు. మురుగునీటి కాల్వలు అస్తవ్యస్తంగా మారాయని, ఫలితంగా దోమల వ్యాప్తి అధికమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు రజిత, నాయకులు సమ్మయ్య, ఖాజామియా, అనిఫా, అజీమా, శ్రీను పాల్గొన్నారు.